క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



గ్లౌజులు అందజేస్తున్న కమిషనర్ మోహన్

మెట్‌పల్లి: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ మోహన్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కార్మికులకు చేతి గ్లౌజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పని చేసే సమయంలో కార్మికులు తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు ధరించాలన్నారు. పట్టణ పరిశుభ్రతలో కార్మికుల పాత్ర కీలకమని, వారి ఆరోగ్య రక్షణకు మున్సిపల్ తరఫున తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్ తదితరులున్నారు.

విద్యార్థికి సన్మానం



సహస్రను సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: ఆర్మీ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌లో విలువిద్యలో శిక్షణ పొందడానికి ఎంపికైన పట్టణానికి చెందిన మేడిచెల్మె సహస్రను మంగళవారం విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఇప్పటికే పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన సహస్ర భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అధ్యక్షుడు కొండ మురళి, ఎదులాపురం కుమార్, కొడిమ్యాల వెంకటస్వామి, పులిమామిడి చంద్రయ్య, గుగ్గిళ్ల లక్ష్మణ్ తదితరులున్నారు.

మహిళా స్వీపర్లకు చీరలు, నగదు పంపిణీ



చీరలు, నగదు పంపిణీ చేస్తున్న రవీందర్

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రోజు వారీ పనులు చేస్తున్న 25 మంది మహిళా స్వీపర్లు ఒక్కొక్కరికి ఒక చీర, రూ.5వేల నగదు చొప్పున అందజేసి ఉదారత చాటుకున్నాడు. రాజారం గ్రామానికి చెందిన సొల్ల నరేశ్ (జైనా పీఏసీఎస్ చైర్మన్) ఆధ్వర్యంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జక్కు రవీందర్ చేతుల మీదుగా అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని దుంపేట గ్రామంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హిందూ మహాసభ వాల్‌పోస్టర్‌ను మంగళవారం స్థానిక నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 22న ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు సమీపంలో నాచుపల్లి వద్ద హిందూ మహాసభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెల్ల వేణు, రాజేంద్రప్రసాద్, ఎస్సై రమేశ్, హెచ్ఎం గుండేటి రవి, ఆకుల రాజేశ్, నర్క రమేశ్, రంజిత్, రాజేందర్ పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

జగిత్యాల: గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ అన్నారు. మంగళవారం జగిత్యాలలోని గుల్లపేట గ్రామంలో 18 తెల్లజాతి పశువులు, 218 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాలికుంటు వైరస్ ప్రాణాంతకమైందని, సూక్ష్మజీవుల వల్ల పశువులకు ప్రబలి అధిక జ్వరం, సొంగ కారడం, నోట్లో పొక్కులు వస్తాయని, రైతులు తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ గంగాధర్, విశాల్, నరేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

రాయికల్: మండలంలోని అర్హులు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. మంగళవారం మీసేవ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిబంధనల ప్రకారం గ్రామాల్లో రూ.1.50 లక్షలు, పట్టణంలో రూ.2 లక్షల ఆదాయం ఉన్న వారే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లించే వారు, సొంత కారు ఉన్నవారు అనర్హులని తెలిపారు. డెప్యూటీ తహసీల్దార్ గణేశ్, ఆర్ఐలు పద్మయ్య, దేవదాసు పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- రాయికల్ బల్దియాలో సిబ్బంది కొరత
- పారిశుధ్యంపై ప్రభావం
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు



చెత్త సేకరిస్తున్న మున్సిపల్ కార్మికులు (ఫైల్)

రాయికల్: సిబ్బంది కొరతతో రాయికల్ పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. వార్డుల్లో మురికి కాలువలు తీయకపోవడంతో దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఉన్న అరకొర సిబ్బందిపై పనిభారం పడుతోంది. పట్టణ జనాభా సుమారు 20 వేలు ఉండగా, పారిశుధ్య నిర్వహణకు కేవలం 24 మంది సిబ్బంది ఉన్నారు. రోజూ పలు వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. చెత్త సేకరణకు ఆరు ఆటోలు ఉండగా ఐదింటిని, రెండు ట్రాక్టర్లు ఉండగా ఒకటి చెత్త సేకరణ, మరొకటి తాగునీటి సరఫరాకు వినియోగిస్తున్నారు.

కార్మికులపై పనిభారం

- బల్దియాలో 12 వార్డులు ఉండగా పారిశుధ్య నిర్వహణకు ప్రతీ వార్డుకు కనీసం నలుగురు సిబ్బంది అవసరం ఉండగా కేవలం 24 మందితో పనులు చేపడుతున్నారు.
- ఇందులో అటెండర్, వీధిదీపాల నిర్వహణ, ఎలక్ట్రిషియన్, జవాన్, తాగునీటి నిర్వహణ కోసం విధులు నిర్వహిస్తుండగా మిగతా సిబ్బంది పారిశుధ్య విధులు నిర్వహిస్తున్నారు.
- ఉన్న సిబ్బందిపై పనిభారం పడడంతో పాటు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగినా, ప్రజాప్రతినిధులు పర్యటించినప్పుడు అరకొర సిబ్బందితోనే మున్సిపల్ అధికారులు ఒత్తిడి చేయించి పనులు చేయిస్తున్నారు.
- అంతేకాకుండా బల్దియాకు రూ.1.20 కోట్ల వార్షిక బడ్జెట్ ఉండగా, ఇందులోంచే కార్మికులకు, సిబ్బందికి 40 శాతం నిధులు వినియోగిస్తున్నారు.
- మరికొంత మంది సిబ్బందిని నియమించాల్సి ఉండగా, నిధుల సమస్యతో తీసుకోలేకపోతున్నామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.
- అదనంగా కార్మికులను నియమించి పట్టణాన్ని సుందరీకరణ చేసేలా చర్యలు చేపట్టాలని బల్దియా ప్రజలు కోరుతున్నారు.

బల్దియా :	రాయికల్
వార్డులు :	12
జనాభా :	20,000
సిబ్బంది :	24 మంది (అవుట్‌సోర్సింగ్)

సిబ్బందిని నియమించాలి



బల్దియాలో సిబ్బంది తక్కువగా ఉండటంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. కార్మికులను అదనంగా తీసుకుని పట్టణాన్ని సుందరీకరణ చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. వెంటనే సిబ్బందిని నియమించాలి.

– తురగ శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్, రాయికల్

ఉన్నతాధికారులకు నివేదించాం



బల్దియాలో పారిశుధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న సిబ్బందితోనే ఎప్పటికప్పుడు పట్టణంలో చెత్త సేకరణ చేపడుతున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ముఖ్యంగా నిధుల సమస్య తీవ్రంగా ఉంది.

– మనోహర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, రాయికల్

నత్తనడకన కొనుగోళ్లపై ఎమ్మెల్యే ఆగ్రహం



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడంపై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని వర్షకొండలోగల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వెంటవెంటనే మిల్లులకు పంపాలని, వర్షాలు పడుతున్నందున రైతులను ఇబ్బందికి గురి చేయొద్దని డిమాండ్ చేశారు. పంటలు కోసి నెలరోజులు కావస్తున్నా.. కొనుగోలు వేగవంతం చేయకపోవడమేంటని ప్రశ్నించారు. డీసీవో మనోజ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మాజీ కో–ఆప్షన్ మెంబర్ ఎలేటి చిన్నారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, నాయకులు తుకారం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి



తహసీల్దార్ నుంచి వివరాలు సేకరిస్తున్న డీసీవో మనోజ్‌కుమార్

పెగడపల్లి: ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని నందగిరి, అయితిపల్లిలోని కేంద్రాలను సందర్శించారు. తూకం తీరుపై ఆరా తీశారు. కాంటాలు, హమాలీల సంఖ్య పెంచి తూకంలో వేగం పెంచాలన్నారు. గన్నీ సంచుల కొరత ఉందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా సరిపడా సరఫరా చేస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, తహసీల్దార్ రవీందర్, సీఈవోలు రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, రాజు, సురేశ్, గంగాధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించండి



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కథలాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు, నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, విద్యార్థులు సాధించిన ఫలితాలను వివరిస్తూ కరపత్రం రూపొందించి ఆవిష్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్ అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, మహిళ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల్లో అక్షరాస్యత పెంచాలి

ధర్మపురి: మహిళల్లో అక్షరాస్యత పెంపునకు కృషి చేయాలని ఎంఈవో సీతామహాలక్ష్మి అన్నారు. వయోజన విద్య పథకంలో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 15 నుంచి 60 ఏళ్లు ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వయోజన విద్య పథకంలో భాగస్వాములు చేయాలని సూచించారు. ఈనెల 26 లోపు నిరక్షరాస్యులైన మహిళలు, 6వ తరగతి నుంచి చదువు మానేసిన వారిని గుర్తించి నివేదిక సమర్పించాలని కోరారు. ప్రతీ కేంద్రంలో 10 మందికి ఒక వలంటీర్‌ను నియమించి 100 రోజుల్లో అక్షరాస్యత లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఎంపీడీవో రవీందర్, ఏపీఎం రమాదేవి తదితరులున్నారు.

సమాచారం

నేడు డయల్ యువర్ డీఎం



కల్పన

జగిత్యాల: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ జగిత్యాల డిపో మేనేజర్ కల్పన తెలిపారు. ప్రయాణికులు సమస్యలు, సలహాలు అందించవచ్చని సూచించారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 99592 25925 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు వివరించాలని తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేట, వెంకటాపూర్ సబ్‌స్టేషన్లలో 33 కేవీ ఫీడర్ల మరమ్మతు కారణంగా మోహన్‌రావుపేట, గుమ్లాపూర్, వెంకటాపూర్, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రఘుపతి తెలిపారు. మేడిపెల్లి మండలం కట్లకుంట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కట్లకుంట, పోరుమల్ల, గుండ్లపల్లి, తొంబర్‌రావుపేట గ్రామాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మల్యాల పరిధిలో..

మల్యాల: మల్యాల 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దయానంద్ తెలిపారు. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

జగిత్యాల: మెడికేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలం సిరికొండలో మున్నూరుకాపు కుల సంఘ సభ్యులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు కిరణ్ తెలిపారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రవి, ప్రతాప్‌రెడ్డి, మేనేజర్ కరుణాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



జగిత్యాలరూరల్: బోనాలతో వస్తున్న భక్తులు



కథలాపూర్: రథోత్సవంలో భక్తులు



జగిత్యాలరూరల్: పూజలు చేస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

బోనాలు.. రథోత్సవం

జగిత్యాలరూరల్/రాయికల్/కథలాపూర్: గిత్యాల రూరల్ మండలం పొరండ్లలో మంగళవారం ఎల్లమ్మతల్లి బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆలయంలో పూజలు చేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

రాయికల్ మండలం భూపతిపూర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. రాయికల్ పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య, ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు బోనాలు సమర్పించారు. భూపతిపూర్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కథలాపూర్ మండలం దుంపేట గ్రామంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



రాయికల్: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



కథలాపూర్: కథలాపూర్ మండలం పెగ్గెర్ల గ్రామశివారులోని ఊర చెరువు మత్తడి పగుళ్ల బారి నీరు వృథాగా పోతోంది. చెరువులో నీళ్లు అడుగంటిపోయే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు. వర్షకాలానికి ముందే మత్తడికి మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ప్రశాంత్, నీటిపారుదలశాఖ డీఈ, వేములవాడ డివిజన్, సెల్ 80740 92371

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఉస్మాన్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు కమిషనర్ మోహన్‌కు కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. కార్మిక సంఘం అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

15 నెలల్లో రూ.3 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు



చెక్కులు పంపిణీ చేస్తున్న నర్సింగరావు

ఇబ్రహీంపట్నం: కోరుట్ల నియోజకవర్గంలో 15 నెలల్లో రూ.3 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో 15 మందికి రూ.5,07,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, తిమ్మాపూర్ ల్‌విండో చైర్మన్ బాస శ్రావణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగాం గంగాధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్వర్, పోనకంటి వెంకట్, నేరేళ్ల దేవేందర్, వేల్పుల శ్రీనివాస్‌రావు, పెంట లింబాద్రి, రెబ్బటి రాజశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

మేడిపల్లిలో..

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్‌లో మంగళవారం కూనరపు లక్ష్మికి కాంగ్రెస్ నాయకులుసీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. నాయకులు ముస్కెం జలందర్‌గౌడ్, ఎదులాపురం వేణు, చిట్యాల రాజేశ్, క్రాంతి, సుదాబోయిన రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నంచర్లలో 38 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

పెగడపల్లి: యాసంగి సీజన్‌లో మండలంలోని నంచర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 38 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు సంఘం చైర్మన్ మంత్రి వేణుగోపాల్, సీఈవో రౌతు మధుకర్ తెలిపారు. ఇందులో నుంచి 36 వేల క్వింటాళ్ల ధాన్యం మిల్లర్లకు చేరవేశామని, ఇంకా 2 వేల క్వింటాళ్ల ధాన్యం కేంద్రాల్లో ఉందని పేర్కొన్నారు.

మలేసియాలో హబ్సీపూర్ వాసి అదృశ్యం..?

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన కారం నర్సయ్య మలేసియాలో అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు మంగళవారం మాజీమంత్రి జీవన్ రెడ్డిని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. హబ్సీపూర్‌కు చెందిన నర్సయ్య 20ఏళ్లుగా మలేసియా వెళ్లి వస్తున్నాడు. గతేడాది నుంచి సంబంధాలు తెగిపోయాయి. దీంతో కుటుంబ సభ్యులు అక్కడ తెలిసిన వారి ద్వారా వివరాలు సేకరించగా నర్సయ్య మృతిచెందాడని అనుమానం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆయన ఆచూకీ తెలుసుకోవాలని జీవన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన మలేసియాలోని సర్వీస్ నంబర్‌కు ఫోన్ చేశారు. రాష్ట్ర గల్ఫ్ బోర్డు మెంబర్ మంద భీంరెడ్డికి ఫోన్ చేసి నర్సయ్య ఆచూకీ తెలుసుకోవాలని సూచించారు.

మందుబాబుకు జైలు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ గ్రామానికి చెందిన బసంత్ ఠాకూర్ అతిగా మద్యం తాగి వాహనం నడుపగా ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ కేసు నమోదు చేశారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కరుణాకర్ జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

దూషించిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: మండలంలోని లచ్చక్కపేటలో ధాన్యాన్ని ఓ వ్యక్తి భూమిలో పోసుకున్నందుకు రైతులను, ప్యాక్స్ నిర్వాహకులను అసభ్య పదజాలంతో దూషించి, చంపుతానని బెదిరించిన యజమానిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఆకుల శేఖర్ ముంబయిలో నివాసం ఉంటాడు. ఆయన భూమిలో రైతులు ఆరబోసుకున్నారు. విషయం తెలుసుకున్న శేఖర్ సోషల్‌మీడియా వేదికగా రైతులు, కొనుగోలు నిర్వాహకులను దూషించాడు. చంపుతానని పోస్టు చేశాడు. ప్యాక్స్ ఉద్యోగి భూమేశ్ ఫిర్యాదు మేరకు శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చర్యలు తీసుకుంటాం

భూ యజమానిపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ లత అన్నారు. గ్రామానికి చేరుకుని రైతులు, నిర్వాహకులతో మాట్లాడారు. ఆమె వెంట తహసీల్దార్ వహీదొద్దీన్, ఎస్సై దత్తాద్రి, డిటి రాజశేఖర్, ఆర్ఐ వెంకటేశ్, విండో సీఈవో లైశెట్టి శివ, సెర్ప్ ఏపీఎం రాజయ్య ఉన్నారు.

ఫిర్యాదు చేశాడని..

అటవీ అధికారులపై ఫిర్యాదు చేశానన్న కోపంతో తన దుకాణాన్ని మంగళవారం ధ్వంసం చేశారని బాధితుడు సలికె మురళి తెలిపారు. బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మురళి లక్ష్మీనృసింహస్వామి ఆలయ సమీపంలో టేలా ఏర్పాటు చేసుకున్నాడు. అటవీ భూములు కబ్జా అవుతున్నాయని అటవీశాఖ అధికారులపై మూడు నెలల క్రితం ఉన్నతాధికారులకు మురళి ఫిర్యాదు చేశాడు. ఇటీవల అటవీశాఖ అధికారి కార్యాలయం ముందు ధర్నా చేశాడు. దీనిని మనసులో పెట్టుకున్న అధికారులు తాను నడుపుతున్న టేలాను ధ్వంసం చేశారని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇది మండలంలో చర్చనీయాంశమైంది.

రిజిస్ట్రీ చేసుకోవాలి

మేడిపల్లి: రైతులు ఫార్మర్ రిజిస్ట్రీకి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి షాహిద్ అలీ అన్నారు. మంగళవారం మేడిపల్లిలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు ఆదార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఫోన్‌నంబర్‌తో ఏఈవోను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.